హైకోర్ట్ జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా జడ్జి, జిల్లా కలెక్టర్లు

విశాలాంధ్ర-పార్వతీపురం : గుజరాత్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జడ్జి చీకటి. మానవేంద్రనాథ్ రాయ్ ను విజయనగరం ప్రిన్సిపాల్ జిల్లా జడ్జి ఎం.బబిత, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పార్వతీపురం పండగ నిమిత్తం విచ్చేసిన న్యాయమూర్తిని ఆయన స్వగృహంలో కలిసి కొద్దిసేపు మాట్లాడారు.

8న కురుపాంలో సీనియర్ సిటిజన్ లతో యోగాంధ్ర

విశాలాంధ్ర-కురుపాం: కురుపాంలో ఈ నెల 8వ తేదీన సీనియర్ సిటిజన్ లతో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. యోగాంధ్రపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 5వ తేదీన సీతంపేటలో పర్యాటక ప్రాంతాలలో యోగ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యోగాంధ్ర శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని ఆయన అన్నారు. యోగ ప్రతీ ఒక్కరి జీవితంలో భాగస్వామ్యం కావాలని, ప్రతీ రోజు సాధన చేయాలని ఆయన అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి మరియు పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి మరియు పాలకొండ సబ్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె హేమలత, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం సుధారాణి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు, పార్వతీపురం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఏ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణంలో ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ పండుగలు మంగళవారం అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. తెల్లవారుజాము నుండే వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అనూష దంపతులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ మూడేళ్ల తర్వాత శ్రీ ఇప్పల పోలమ్మ, శ్రీ ఎర్రకంచెమ్మ పండుగలు అంగరంగ వైభవంగా జరుగుతుండడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పండగలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది అమ్మవారి దర్శనానికి భారీ ఎత్తున భక్తులు రావడం ప్రజల్లో ఆధ్యాత్మికత పెరిగింది అనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. పార్వతీపురం పరిసర ప్రాంతాల ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని సమృద్ధిగా వర్షాలు పడి పంటలు బాగా పండాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు ఎమ్మెల్యే విజయ చంద్ర తెలియజేశారు.

సీతానగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన ఐటిడిఏ ఉప జిల్లా వైద్యశాఖాధికారి

విశాలాంధ్ర-సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఐటిడిఏ ఉప జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ కె.వి.ఎ.స్ పద్మావతి మంగళవారం సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి వైద్య సేవలను సక్రమంగా అందించాలన్నారు. కరోనా మళ్ళీ వ్యాప్తి చెందుతుందని, ప్రజలు జాగ్రత్తలతో ఉండేలా అప్రమత్తం చేయాలని తెలిపారు. ఆసుపత్రిలో సిబ్బంది హాజరు, రికార్డులు, ల్యాబ్, స్టాక్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఉషారాణి, సిహెచ్ఓ ఎస్వీ రమణ, సీనియర్ అసిస్టెంట్ మురళి, హెచ్వీ భవానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అమ్మవార్లను దర్శించుకున్న పార్వతీపురం, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం పట్టణంలోని శ్రీఇప్పలపోలమ్మ, శ్రీఎర్ర కంచమ్మ, శ్రీబంగారమ్మ తల్లుల పండుగ సందర్భముగా పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తదితర ప్రముఖులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పండగ సందర్భంగా పార్వతీపురం మొత్తం శోభాయ మానంగా వెలుగొందుతోంది. పట్టణమంతా భారీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎక్కడికక్కడ తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలను ఏర్పాటుచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తొలిరోజు నుండి పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అధికారులు, కమిటీ నాయకులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు. దీంతో భక్తులు సంతోషం వెలిబుచ్చుతున్నారు.

పుట్టూరులో దాహం కేకలు...

శివారు వీధులకు అందని తాగునీరు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: మండలంలోని పుట్టూరు గ్రామ ప్రజలు దాహార్తితో అల్లాడిపోతున్నారు. గ్రామంలో ఉన్న కుళాయిలు దిష్టిబొమ్మల కనిపించడం తప్పక ప్రజల దాహార్తిని మాత్రం తీర్చలేక పోతున్నాయి. వేసవి కాలంలో నీటి ఎద్దడి తో గ్రామస్తులు త్రాగునీరు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామంలో ఉన్నటువంటి చెరువు నీరుని ఉపయోగించుకొని అవసరాలు తీర్చుకుంటున్నామని మహిళలు వాపోతున్నారు. అయితే తాగేందుకు మాత్రం మంచినీరు లభించక కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నామని, అలాగే బయట మార్కెట్లో లభించే మినరల్ వాటర్ తాగడం మూలంగా కీళ్ల నొప్పులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామంలో గల ప్రధాన రహదారి వీధి, అంగన్వాడి వీధి, బజారు వీధి లకు పూర్తిస్థాయిలో కొళాయి నీరు సరఫరా కావడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. సమీపంలో గల సూడిగం పంచాయతీ మూడడ్ల వలస గ్రామం నుంచి కులాయినీరుకు పరుగులు పెట్టాల్సివస్తుందని, ఆ పంచాయతీ కి కులాయిలు సరఫరాయి పుట్టూరుకు రాకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలోని ప్రతి వీధికి కుళాయి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కార్యకర్తలే నా గుండె చప్పుడు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: పార్టీ విజయం కోసం రాత్రి పగలు కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్త తనకు రెండు కళ్ళు లాంటి వారిని, వారి యోగక్షేమాలే నా గుండె చప్పుడు అని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని డోకి శీల పంచాయతీ చలంవలస గ్రామంలో పార్టీకి చెందిన కీలక కార్యకర్త ఇంట్లో జరిగిన ఓ శుభకార్యానికి మంగళవారం ఆయన ముఖ్య అతిధిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయ్ చంద్ర దంపతులు ఇద్దరు హాజరై చిన్నారులు దీవించి, విందు భోజనాల్లో భాగస్వాములయ్యారు. సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ ఏ కష్టసుఖాలు వచ్చిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీను మరింత బలోపేతం చేయాలని, గత వైసిపి హయాంలో ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఎంతో అవమానాలు భరించి, ఎన్నో కేసులను ఎదుర్కొన్నారని అటువంటి వారిని గుండెల్లో పెట్టుకుంటానని మరోసారి గుర్తు చేశారు. పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడుతున్న కార్యకర్తలకు ,నాయకులకు సరైన సమయంలో సరైన గుర్తింపు, గౌరవం, పదవి లభిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే సతీమణి అనూష ,మండల అధ్యక్షులు చంటిబాబు, చంద్రమౌళి గురజాన , తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

65 ఏళ్లు దాటిన వారికి ఇంటి వద్దకే నిత్యావసరాలు : జేసీ శోబిక

విశాలాంధ్ర-పార్వతీపురం: జిల్లాలో చౌక ధరల దుకాణాల నుండి నిత్యావసర వస్తువులను వికలాంగులకు, 65 సంవత్సరాల వయసు దాటిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందజేస్తామని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోబిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వృద్ధులు, వికలాంగులు రేషన్ దుకాణాల వద్ద క్యూ లైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేదన్నారు. రేషన్ డీలర్ స్వయంగా ఇంటి వద్దకు వచ్చి మీకు రావాల్సిన రేషన్ సరుకులను అందజేస్తారని ఆమె తెలిపారు.

బలిజిపేట పీహెచ్‌సీలో మలేరియా మాసోత్సవాలు

విశాలాంధ్ర-బలిజిపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో మంగళవారం మలేరియా మాసోత్సవాలు సందర్భంగా వైద్య అధికారిని డాక్టర్ క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది.. ఈ నెలలో మలేరియా జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలు తో ర్యాలీ జరిగింది జూన్ 1 నుంచి 30 వ తేది వరకు ఈ మాసోత్సవాలు ప్రతి హెల్త్ క్లినిక్ లో జరుగుతాయి అని మెడికల్ ఆఫీసర్ చెప్పారు.

అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే విజయచంద్ర దంపతులు

విశాలాంధ్ర-పార్వతీపురం: పట్టణంలోని శ్రీఇప్పల పోలమ్మ, శ్రీఎర్రకంచమ్మ శ్రీబంగారమ్మ తల్లి పండుగలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజామునుండే వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, సతీమణి అనూష దంపతులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఎమ్మెల్యే విజయ చంద్ర మాట్లాడుతూ మూడేళ్ల తర్వాత శ్రీ ఇప్పల పోలమ్మ, శ్రీ ఎర్రకంచెమ్మ పండుగలు అంగరంగ వైభవంగా జరుగుతుండడం ఆనందంగా ఉందన్నారు. పండగలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈఏడాది అమ్మవారి దర్శనానికి భారీ ఎత్తున భక్తులు రావడం ప్రజల్లో ఆధ్యాత్మికత పెరిగిందనడానికి నిదర్శనమన్నారు. పార్వతీపురం పరిసర ప్రాంతాల ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని సమృద్ధిగా వర్షాలుపడి, పంటలు బాగా పండాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు ఎమ్మెల్యే విజయచంద్ర తెలియజేశారు.

నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం సబ్ డివిజన్లో నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ మంగళవారం నాడు ఆకస్మిక తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, 65 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటి వద్దనే రేషన్ అందించడం జరుగుతుందని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. అన్ని రేషన్ డిపోలలో ఈనెల 15వరకు సరుకులు పంపిణీ కొనసాగుతుందని, నిత్యావసర సరుకుల నిల్వలు సరిపడా ఉంటాయని, అందవనే అనుమానాలు వద్దని ఆయన చెప్పారు. ఇంటి వద్దనే బియ్యం అందించుటకు అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు. చౌక ధరల దుకాణాలకు వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. చౌక ధరల దుకాణాలు ఉదయం 8 గంటలకు విధిగా ప్రారంభం కావాల్సిందేనని స్పష్టం చేశారు. రెండు పూటలు డీలర్లు పంపిణీ చేస్తారని తెలిపారు. నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు.

80 లీటర్ల నాటుసారా తో వ్యక్తి అరెస్ట్ బైక్ స్వాధీనం

విశాలాంధ్ర-కురుపాం: నవోదయం 2.0లో భాగంగా కురుపాం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిదిలోని చినమేరంగి లో రూట్ వాచ్ చేస్తుండగా బజాజ్ పల్సర్ వాహనంపై అక్రమంగా నాటుసారా రవాణాచేస్తున్న వ్యక్తి ని గుర్తించి 80లీటర్ల నాటుసారా తో ఓ వాహనాన్ని అక్రమ రవాణా చేస్తున్న వెలమల బాబీ అనే వ్యక్తి ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి నట్లు ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాస రావు ప్రకటించారు. ఎస్ ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు. ..

అరకు గిరిజన మ్యూజియం వద్ద వెయ్యి మందితో పర్యాటక యోగ

యోగాభ్యాసనలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్



విశాలాంధ్ర-అరకులోయ: యోగాంధ్ర సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యాటక కేంద్రమైన అరకులోయ లోగల గిరిజన మ్యూజియం వద్ద 952 మందితో యోగ సాధన కార్యక్రమాన్ని పాడేరు సబ్ కలెక్టర్ మంగళవారం ఉదయం పర్యాటక యోగాను ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలందరూ యోగ సాధనలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా ఈనెల 11వ తేదీన మారేడుమిల్లి, 17వ తేదీన చాపరాయి జలపాతాలు వద్ద పర్యాటక యోగ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. అలాగే స్థానిక అరకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, నిరంతర యోగ సాధన తో ఆరోగ్యవంతులు అవుతారని, ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం రాదని, విద్యార్థులలో శారీరక మానసిక దృఢత్వంతో పాటు తెలివితేటలు పెరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగ సాధనకు ముందుకు రావాలని సూచించారు. యోగ కార్యక్రమంలో ఆర్టీసీ ప్రాంతీయ చైర్మన్ దొన్నుదొర, యోగ జిల్లా నోడల్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, 175 మంది యోగశిక్షకులు,పలువురు జిల్లా అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, పలువురు పర్యాటకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



యోగతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ఉల్లాసం

గ్రంథాలయ శాఖ అధికారిని శెట్టి. సునీత

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : యోగ తోనే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ఉల్లాసమని గ్రంథాలయ శాఖ అధికారిని శెట్టి సునీత అన్నారు. మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో సమ్మర్ విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు, చిన్నారులకు గ్రంథాలయ శాఖ అధికారిని సునీత ఆధ్వర్యంలో మంగళవారం యోగ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగ ప్రతి మనిషికి ఎంతో అవసరమని యోగ ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చు అన్నారు. యోగ ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు యోగవ అవసరం అన్నారు. యోగ మనిషికి ప్రశాంతత కలిగిస్తుందని చెప్పారు. కొన్ని రకాలైన ఆసనాలు తో యోగ చేసినట్లయితే మనిషి శరీరం దృఢత్వంతో పాటు ఆరోగ్యంగా ఉండి మనిషికి రోజురోజుకు అందాన్ని కూడా పెంచుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, దృఢత్వంగా, అందంగా ఉండాలంటే తప్పనిసరిగా యోగా అవసరమని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు వినియోగించి అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మండల ఎంపీపీ, జడ్పిటిసి

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : సబ్సిడీపై ప్రభుత్వం అందించే విత్తనాలను మండల రైతులు వినియోగించి అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మండల ఎంపీపీ ఈశ్వరి, జడ్పిటిసి జానకమ్మ చెప్పారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని నీలవేణి ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు 90% రాయితీపై అందిస్తున్న వరి విత్తనాలను సకాలంలో రైతులు వినియోగించుకుని లబ్ధి పొందాలని వారు చెప్పారు. రైతులు వ్యవసాయంపై ఎక్కువ దృష్టి పెట్టి వ్యవసాయం చేసినట్లయితే రైతులు అధిక దిగుబడులతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటువంటి అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పోతంగి పంచాయితీ ఎంపీటీసీ గీత, స్థానిక సర్పంచ్ వెంకట్రావు, తెలుగుదేశం పార్టీ మండల మాజీ అధ్యక్షులు సుబ్బారావు, అరకు పార్లమెంట్ టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి స్వామి, సింహాద్రి, భీమరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తో తాటాకు ఇల్లు దగ్ధ

సర్వం కాలిపోయి 1.50 లక్షల ఆస్తి నష్టం



విశాలాంధ్ర-కొయ్యూరు : ఆకస్మికంగా సంభవించిన విద్యుత్ షాక్ సర్క్యూట్ తో తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోయిన సంఘటన కొత్త బంగారంపేటలో చోటు చేసుకుంది. వివరాలు ఈలా ఉన్నాయి కొయ్యూరు మండలం బంగారంపేట పంచాయతీ కొత్త బంగారుపేట గ్రామానికి చెందిన చింతా వరహాలు తోపాటు కుటుంబ సభ్యులు ఉపాధి హామీ పథకం పనులు ముగించుకొని ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో ఆకస్మికంగా విద్యుత్ షా క్ తో మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో ఉన్న రెండు బీరువాలు బట్టలు తిండి గింజలు నగదు తో పాటు సర్వం కాలి బూడిద అయ్యాయని, సుమారుగా 1, 50వేల రూపాయలు నష్టం వాటిలిందని గ్రామస్తులు తెలిపారు. అదే సమయంలో పక్కనే ఉన్న తాటాకు ఇండ్లకు మంటలు వ్యాపించకుండా గ్రామస్తులందరూకలసి అదుపు చేశారు. విద్యుత్ షాక్ కారణంగా సర్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం అధికా రులు స్పందించి నష్టపరిహారం తో పాటు నూతన పక్క గృహం మంజూరు చేయాలని బాధితులు చింతా వరహాలు కోరుతున్నాడు.

సూపర్ సిక్స్ హామీలు అమలు ఎక్కడ?

నేడు వైసిపి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం

పోస్టర్ విడుదల చేసిన మండల నాయకులు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: ఎన్నికల ముందు కూటమి నాయకులు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ప్రజలకు మోసం చేస్తూ చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలు చేస్తూ, హామీలను గాలికి వదిలేసారని ఆరోపిస్తూ వైసిపి తలపెట్టిన వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల నాయకులు జడ్పిటిసి బలగా రేవతి, బలగ నాగేశ్వరరావు, బొమ్మి రమేష్ కోరారు. కార్యక్రమానికి సంబంధించి మండల వైసీపీ అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలు ,పోస్టల్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఈ నెల నాలుగో తేదీన వెన్నుపోటు దినం నిర్వహించాలని, ప్రతి ఒక్క కార్యకర్త ఈ కార్యక్రమానికి హాజరై గడిచిన ఏడాదిలో రాష్ట్రంలో కూటమి అవలంబిస్తున్న విధానాలు హామీలు అమలు చేయకుండా కాలయాపున చేస్తున్న సంగతిని ప్రజలకు వివరించాలని సూచించారు ఇందులో భాగంగా వైఎస్సార్ కోడల నుంచి కలెక్టరేట్ వరకు జరిగే ర్యాలీలో ప్రతి ఒక్కరు పాల్గొవాలని, ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు వైసిపి సానుభూతిపరులు హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

రేషన్ సరుకులు పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

ఇన్చార్జి తాసిల్దార్ ముజీబ్

విశాలాంధ్ర-డుంబ్రిగుడ: రేషన్ సరుకులు పంపిణీలో నిర్లక్ష్యం చేస్తేడీలర్లపై చర్యలు తప్పవని మండల ఇన్చార్జి తాసిల్దార్ ముజీబ్ అన్నారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం రేషన్ సరుకుల పంపిణీపై రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి తాసిల్దార్ ముజీబ్ మాట్లాడుతూ మండలంలోని 65 సంవత్సరాలు వయసు పైబడిన రేషన్ కార్డుదారులు రేషన్ సరుకులు తీసుకునేందుకు రేషన్ దుకాణానికి రావలసిన అవసరం లేదని, సంబంధిత రేషన్ డీలర్లు వారి ఇంటి వద్ద వచ్చి రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని చెప్పారు. 65 సంవత్సరాలు పైబడిన రేషన్ కార్డుదారులకు రేషన్ దుకాణం వద్ద ఏ డీలర్ అయిన పంపిణీ చేస్తే వారిపై చర్యలు తీసుకుం టామని చెప్పారు. రేషన్ డీలర్లు ప్రజలకు అందించే రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం చేస్తేచర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల ఆర్ఐ రాజు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలి



విశాలాంధ్ర-సీలేరు: ఆశ కార్యకర్తలు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సౌమ్య అన్నారు. జీకేవీధి మండలం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆశ, సీహెచ్‌డబ్ల్యూలకు రీవిరియంటేషన్ ట్రైనింగ్ ఇచ్చారు. ఇందులో అనారోగ్యంతో ఉన్న పిల్లలకు ఓఆర్ఎస్, జింక్ వాడకం, చేతులు కడుక్కోవడం, పారిశుద్ధ్యం, సురక్షితమైన తాగునీరు, ఆహారం పద్ధతుల గురించి వివరించారు. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల తల్లిదండ్రులు, తాతముత్తాతలు, పాఠశాల పిల్లలకు ఓఆర్ఎస్, జింక్ సిరప్ అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఆశ కార్యకర్తలకు పీఎంజేబివై, పిఎంఎస్‌బివైపై అవగాహన కల్పించాలని, రెండు పథకాల కింద 100 శాతం నమోదు నిర్ధారించాలని చెప్పారు. గర్భ నిర్ధారణ కిట్లను తిరిగి స్టాక్‌ను అంచనా వేసి ప్రతీ ఆశ కార్యకర్తకి కనీస 10 కిట్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ ఆశ యాప్, సర్వీసు అప్‌డేట్‌లను పర్యవేక్షించి ఈ ఆశా యాప్‌లో ఆశా కార్యకర్తలచే సకాలంలో సేవా నవీకరణలు అందేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సౌమ్య, ప్రభుత్వ హోమియో వైద్యాధికారి సృజనరాయ్, హెల్త్ సూపర్‌వైజర్ ఎన్.త్రినాథ్, బి.బాలమణి, హెల్త్ అసిస్టెంట్ ఎ.సత్యనారాయణ, ఏఎన్ఎంలు బి.దేవి, ఎం.అరుణకుమారి, కె.విశ్వనందాకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూదరాళ్ళ సచివాలయంలో రేషన్ కార్డుల నమోదుకు గిరిజనుల ఇక్కట్లు

కార్డులు నమోదుకు నిత్యం తిరుగుతున్న డిజిటల్ అసిస్టెంట్ విధులకు రాక రోజు తప్పని పాట్లు..



విశాలాంధ్ర-కొయ్యూరు: అదో కొండ కోనల్లో ఉన్న మారుమూల ప్రాంతం.. ఆపై మెజర్ పంచాయితీ, సరైన రోడ్లుల్లేక..సచివాలయానికి చేరాలంటే 40, 50కిలోమీటర్ల దూరం పైబడి ఉన్న భూదరాళ్ళ పంచాయితీ కేంద్రంలో ఉన్న సచివాలయానికి అత్యంత వ్యయ ప్రయాసలతో వెళ్ళాల్సిన పరిస్థితి.ఈ కార్యాలయానికెళితేనే ఏదైనా పనిఅవుతుంది తప్పా! వేరే మార్గం లేదు. అలాంటి సచివాలయంలో సుమారు 7వేల జనాభకలిగి 36గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన కార్యాలయం. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల సవరణ, కొత్తగా కార్డుల నమోదు, చేర్పులు, మార్పులకు కల్పించిన సదవకాశాన్ని మేం పొందాలంటే ఎన్ని అవంతరాలేదురైన ఈ సచివాలయానికి వచ్చేతీరాలి. అలాంటి కార్యాలయంలో గత వారం రోజులుగా రేషన్ కార్డుల నమోదుకు ఉపాధి పనులు మాని వర్షానికి తడిచి, ఎండను ఎదుర్కొని కాలినడన లేక ఊరంతా కలిపి కొంత దూరం వరకు జీపుల్లో వెళ్ళినా సచివాలయం లో డిజిటల్ అసిస్టెంట్ రోజుల తరబడి విధులకు రాక నానా అవస్థలు పడుతున్నామని నూకరాయితోట, ముకుడుపల్లి, కిండంగి తదితర ఆదివాసీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా డిజిటల్ అసిస్టెంట్ కొరకు తిరిగితిరిగి అలసిపోయి .. మామ్మల్లి ఇన్నిసార్లు తిప్పించడం భావ్యం కాదని ఏ రోజు ఉంటారో కచ్చితంగా చెప్పండని సోమవారం నేరుగా డిజిటల్ అసిస్టెంట్ నే అడిగగా..మంగళవారం ఉంటానని రమ్మని చెప్పటంతో 3వ తేది 3వేలు చెల్లించి జీపు కట్టుకుని భూదరాళ్ళ సచివాలయానికి వస్తే డిజిటల్ అసిస్టెంట్ విధులకు రాలేదని పిర్యాదు చేశారు. తీరా డిజిటల్ అసిస్టెంట్ విధులకు రాలేదని కనీసం ఫోన్ చేసినా పట్టించకోలేదంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై స్థానిక సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ మరియు వార్డు సభ్యులు సంజీవ్ లు ఫోన్ చేస్తే వారం రోజులపాటు సెలవు లో ఉన్నట్టు తప్పుడు సమాధానం తెలిపినట్టు సర్పంచ్ సంజీవ్ తెలిపారు. భూదరాళ్ళ డిజిటల్ అసిస్టెంట్ వారం రోజులుగా కార్డుల నమోదు కు తిప్పిస్తున్నారని ఎన్ని రోజులు తిరగలంటూ సెక్రెటరీ లిలా కృష్ణను ఆయా గ్రామస్తులు ప్రశ్నించగా డిజిటల్ అసిస్టెంట్ సెలవు పెట్టలేదని తెలిపినట్టు ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. ప్రజలకు సేవలు అందించలేని డిజిటల్ అసిస్టెంట్ పై తక్షణమే బదిలీ చేసి ప్రత్యామ్నాయంగా వేరే ఒకరిని నియమించాలని సర్పంచ్ ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ ఎంపీడీవో ను కోరినట్టు తెలిపారు. సచివాలయం కార్యదర్శి మరియు ఎంపీడీవో, స్థానిక సర్పంచ్ లకు కనీస సమాచారం ఇవ్వకుండ తరుచూ విధులకుడుమ్మా కొడుతూ ఉన్న (సక్రమంగా హాజరు కాకుండా) ఉన్న డిజిటల్ అసిస్టెంట్ పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ డిమాండ్ చేశారు. డిజిటల్ అసిస్టెంట్ విధులకు సక్రమంగా హాజరుకాకపోవటం విషయమై వచ్చిన పిర్యాదు పై ఇప్పటికే తగు హెచ్చరిక చేశామని ప్రజలకు సర్వీస్ చేయని ఆ ఉద్యోగి పై ఉన్నతాదికార్లు కు తెలియజేసి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జీవిడి ప్రసాద్ రావు తెలిపారు.

28, 31

విశాలాంధ్ర
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
బుధవారం 4, జూన్ 2025

ఆకస్మికంగా వాహన తనిఖీలు

విశాలాంధ్ర-అడ్డతీగల : ఏజెన్సీ మండల కేంద్ర మైన అడ్డతీగల లో మంగళవారం వారపు సంత రోజున రంపచోడవరం ఆర్టీవో రాజేష్ కుమార్ వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం లోని వేట మామిడి గ్రామం వద్ద నిర్వహించిన తనిఖీల్లో భాగంగా ఒక లారీ, 5 మోటార్ సైకిళ్ళు, ఒక టాటా ఏసీ వాహనము మరియు బొలెరో వాహనదారుల నుండి సరైన ప త్రాలు లేకపోవడంతో 53 వేల రూపాయలు అపరాధ రుసుము వసూలు చేశారు ఈ సందర్భంగా ఆర్టీవో రాజేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు " సరైన పత్రాలు కలిగి ఉండాలని లేనిచో కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే పడే శిక్షలు గురించి వివరించి తెలిపారు. అందరూ తప్పనిసరిగా సరైన పత్రాలు వాహనాల్లో ఉంచుకోవాలని విధిగా డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని తెలిపారు.

దోమ కాటు ప్రమాదకరం.. ముందుజాగ్రత్తలు అవసరం

జూన్ 30 వరకు మలేరియా మాసోత్సవాలు

విశాలాంధ్ర-చింతపల్లి: దోమ ఈ పేరు వినడానికి సాధారణం గాను, పరిమాణంలో చిన్నదిగా ఉన్నప్పటికీ దీని వలన కలిగే దుష్పరిణామం మాత్రం ప్రమాదకరంగా ఉంటుందని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. చిన్న, పెద్ద, ఆడ ,మగ అనే తారతమ్యం లేకుండా దోమ కాటు బారిన పడిన ప్రజలు అనారోగ్యంతో బాధపడటమే కాకుండా, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలను సైతం కోల్పోవలసిన ప్రమాదము లేకపోలేదు. ఈ మేరకు దోమ కాటు నుండి రక్షణ పొందడానికి ప్రతి ఒక్కరు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లయితే అనారోగ్యం బారిన పడకుండా ఉండటానికి అవకాశం ఉంటుంది.

దోమ పెరుగుదల ఇలా..

దోమల జీవిత చక్రాన్ని పరిశీలించినట్లయితే దోమ వారం రోజుల్లో ఎగ్,(గుడ్లు) లార్వా, ప్యూపా, దశ నుంచి దోమ గా మారుతుంది. దోమగా వృద్ధి చెందిన తర్వాత మానవ రక్తాన్ని ఆహారంగా స్వీకరిస్తుంది. దోమలు ఎక్కువగా గృహ పరిసరాలలోనీ వ్యర్థాలలోను, మురుగునీరు నిల్వ ఉన్న గుంతలలోనూ, తాగి పారేసిన ఖాళీ, నీరు నిల్వ ఉండే ఇతర ప్రదేశాల్లోనూ, అధికంగా కనిపిస్తుంటాయి. కీటక జాతికి చెందిన దోమలు చూడటానికి పరిమాణంలో చిన్నదిగా ఉన్నప్పటికీ దీని వలన కలిగే దుష్పరిణామం (నిర్లక్ష్యం చేస్తే) మాత్రం ప్రమాదకరమే. దోమలలో,అనాఫిలస్, క్యూలెక్స్, ఎడిస్ ఈజిప్ట్ అనే పేర్లతో వీటిని పిలుస్తుంటారు . వీటిలో ఎక్కువగా హాని చేసే దోమలు మాత్రం ఆడ ఎనాఫిలస్ దోమలు అని చెప్పక తప్పదు. దోమల కాటు వలన శరీరంలో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ ఆడ అనాఫిలస్ దోమల కాటు పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే హాని కలుగుతుంది. ఇవి రాత్రి వేళల్లోను, తెల్లవారు జామున ఇవి ఎక్కువగా కనిపిస్తూ, ప్రజల శరీరంపై వాలుతూ చిరాకును కలిగించడమే కాకుండా తమ చూషకాన్ని మానవ శరీరంలోకి ప్రవేశింప జేసి మానవ రక్తాన్ని ఆహారంగా స్వీకరిస్తుంది. దోమలకు ప్రధాన వాహకమైన మానవ శరీరం పై ఆధారపడి దోమలు జీవిస్తాయి.

దోమ కాటు నుండి రక్షణ

దోమ కాటుకు గురికాకుండా ఉండాలంటే గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవడంతోపాటు సాయంత్రం వేళల్లో గృహాలలో ఉన్న కిటికీ తలుపులను మూసివేయాలి. పడుకునే సమయంలో ఖచ్చితంగా దోమతెరలు వాడాలి. పని నిమిత్తము బయటికి వెళ్లాల్సిన పరిస్థితి లో శరీరాన్ని దుస్తులతో పూర్తిగా కప్పి వేయాలి. దోమలు వృద్ధి చెందే స్థావరాలను ముందుగా గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలి.

దోమల వలన కలిగే వ్యాధులు

దోమల కాటు వలన మలేరియా, బోదకాలు, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు వంటి వ్యాధులు సోకుతాయి.

దోమల నిర్మూలనకు చర్యలు

దోమల నిర్మూలన కు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఏజెన్సీ వ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఏప్రిల్ 15 వ తారీకు నుండి ఆల్ఫా సైఫర్ మేత్రిన్ (ఏ సి ఎం) 5% దోమల మందు పిచికారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే ఎంపిక చేసిన గ్రామాలలో మొదటి విడత ఈ స్ప్రేయింగ్ పనులు చింతపల్లి ఏజెన్సీ లో దాదాపుగా పూర్తయ్యాయి.. అదే విధంగా నీరు ఎక్కువగా నిల్వ ఉండే గృహ పరిసరాలలో వైద్య సిబ్బంది ద్వారా ఎబేట్ మందును చల్లించే కార్యక్రమాలు చేపడుతుంది. వైద్య సిబ్బంది దోమలు వృద్ధి చెందే స్థావరాలను ముందుగా గుర్తించి,. నివారణ చర్యలు చేపడు తున్నారు. గృహ పరిసరాలలో గుంతలలో నీరు నిలువ లేకుండా గుంతలను పూడ్చివేసేలా సంబంధిత గృహ యజమానులకు వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు

నిర్వహిస్తున్నారు. ప్రతి శుక్రవారం గ్రామాలలోని గృహాలను సందర్శించే విధంగా ప్రభుత్వం " డ్రైడే ఫ్రైడే " వంటి కార్యక్రమాల ద్వారా ముందు జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమా లకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.



జూన్ 30 వరకు మలేరియా మాసోత్సవాల కార్యక్రమం

జూన్ నెల నుండి సెప్టెంబర్ వరకు వర్షాకాలం కావడంతో దోమలు ఎక్కువగా వృద్ధి చెందే అవకాశం ఉండడంతో ఈ క్రమం ద్వారా దోమల నివారణకు ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతోంది ఇందులో భాగంగా ప్రతి ఏడాది జూన్ ఒకటో తారీకు నుంచి 30 వ తారీఖు వరకు మలేరియా మాసోత్సవాల కార్యక్రమం నిర్వహిస్తోంది. జులై మొదటి రోజు నుంచి 31 వ తారీకు వరకు డెంగ్యూ మాసోత్సవాల కార్యక్రమాలలో భాగంగా ర్యాలీలు, సమావేశాలు వంటి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యం లో మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వ చర్యలకు, ప్రజల నుంచి కూడా పూర్తి సహకారం లభించినట్లయితే దోమల పెరుగుదలను అరికట్టవచ్చు.

జ్వరమా !మలేరియా కావచ్చు?

తీవ్రమైన చలి జ్వరం, తలనొప్పి, ఒంటినొప్పులతో వాంతులు, వంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి, రక్త, వైద్య పరీక్షలు చేయించుకోవాలి. అదే క్రమంలో మలేరియా ఉన్నట్లయితే, మలేరియా వ్యాధి నయం అయ్యేందుకు వైద్యుల సలహా మేరకు తగిన మందులు పూర్తిస్థాయిలో వాడాలి. ప్రస్తుతం ప్రతి ఆరోగ్య కేంద్రంలో దీనికి సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయి. మలేరియా వ్యాధికి గురైన బాధితులు పూర్తి స్థాయిలో మందులు వాడినట్లయితే, మలేరియా వ్యాధి బారిన పడకుండా రక్షణ పొందేందుకు వీలుంటుంది. అదే క్రమంలో మనతో పాటు మన చుట్టుప్రక్కల ఉన్న ప్రజలను కూడా రక్షించిన వారము కాగలము.ఈ నేపధ్యంలో దోమ కాటును ప్రమాదకరంగా గుర్తించి /భావించి తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతిక్షణం భయం భయం

శిథిలావస్థలో ఎంపిడిఓకార్యాలయ భవనం

బిక్కుబిక్కుమంటూ విధులు చేపడుతున్న సిబ్బంది

ఊడిపోతున్న గోడలపై పెచ్చులు



విశాలాంధ్ర-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ భవనం మరమత్తుకు గురై శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. భవనం లోపల స్లాబ్, గోడలపై పెచ్చులు ఊడి పడుతుండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందనే పరిస్థితి ఉంది. సిబ్బంది విధులు నిర్వర్తించే చోట పై పెచ్చులు పడుతుండడంతో వారు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ సమయంలోనైనా గోడల పై పెచ్చులు సిబ్బందిపై పడతాయనే భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఉంది. సిబ్బంది కాకుండా వివిధ పనుల నిమిత్తం ఎంపీడీవో ఓ కార్యాలయానికి వచ్చిన మండల గిరిజనులు సైతం భయాందోళనకు గురవుతున్నారు. ఈ మండల పరిషత్ కార్యాలయ భవనం నిర్మించి సుమారు 22 ఏళ్లు దాటడంతో మరమ్మతులకు గురై శిథిలావస్థలో చేరుకుంటుంది. అప్పటినుంచి ఇప్పటివరకు ఎటువంటి మరమ్మతులు చేయక పోవడంతో పై పెచ్చులు ఊడిపోయి ప్రమాద కరంగా తయారవుతుంది. నాణ్యతగా టైల్స్ వేయకపోవడంతో టైల్స్ వేసి టైల్స్ ఏడాది కాకుండానే అవి ఊడిపోతున్నాయి. మండల అభివృద్ధి కార్యక్రమాలకు నిలయంగా ఉన్న స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థలో చేరుతున్న కనీసం మరమ్మత్తుకు కూడా నోచుకోకపోవడం విచారకరమని మండల గిరిజనులు అంటున్నారు.తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయ భవనాలు మరమ్మతులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజా ప్రతినిధులు, గిరిజనులు కోరుతున్నారు.

కొనసాగుతున్న యోగాంధ్ర కార్యక్రమాలు

విశాలాంధ్ర-సీతానగరం: మండలములోని యోగాంధ్ర కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఎంపీడీవో ఎం ఎల్ ఎన్ ప్రసాద్, తహసిల్దార్ ప్రసన్నకుమార్, డిప్యూటీ ఎంపీడీవో కుమార్ వర్మలు తెలిపారు. రిజిస్ట్రేషన్ కూడా కొనసాగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు పర్యవేక్షణ చేయడంతో పాటు యోగాంధ్ర కార్యక్రమాలు ప్రతిరోజు జరిగేలా చూస్తున్నారు. ఇదిలాఉండగా ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అన్ని గ్రామాల్లో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని తెలిపారు.

రేఖపల్లి ఎస్సీ కాలనీ ని పోలవరం ముంపు జాబితాలోకి చేర్చండి

విశాలాంధ్ర-వి.ఆర్. పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం చింతూరు రెవిన్యూ డివిజన్ మండల కేంద్రం రేఖపల్లి గ్రామ పంచాయతీలోనీ ఎస్ సి కాలనీ హరిజన గ్రామస్తులు పోలవరం ముంపు జాబితాలో చేర్చండి అని మొరపెట్టుకుంటున్నారు.మళ్ళీ వరదలు వచ్చే సమయం అతి దగ్గరలోనే ఉండటం వల్ల భయాందోళనకు గురవుతున్నారు.మా ఎస్ సి కాలని గ్రామం ముంపునకు పూర్తిగా గురవుతుందని పలు మార్లు మండల స్థాయి నుంచి జిల్లా ఐఏఎస్ అధికారులను కలిచి మా గోడు మా బాధలు చెప్పి వినతిపత్రాలు ఇచ్చిన ఇంతవరకు మా సమస్యను పటించుకునే నాధుడే లేడనీ మరో వైపు వచ్చే జులై నెలలో వరదలు వస్తాయి మళ్ళీ మూట ముళ్ళ అన్ని సర్దుకుని ఇంట్లో ఉన్న సా మన్లు వదిలి వెళ్ళిన రోజులు ఉన్నాయని ,వరదలు తగ్గే వరకు 2 లేదా 3 నెలలు సొంత గ్రామాన్ని వదిలి ఉండాల్సిన పరిస్థితి కరెంట్ ఉండదు చీకట్లో 3 నెలలు గడపవలిసి వస్తుంది ఏ విషసర్పాలు కాటు వేస్తాయో ప్రాణాలు అరచేతిలో పెట్టుకోని గడపవలిసి వస్తుంది. గతంలో అధికారుల తప్పిదం వల్ల మా ఎస్ సి కాలని గ్రామం 41.15 కాంటూర్ లెవల్ లెక్క లో లేకుండా పోయిందనీ.మా ఎస్ సి కాలని ముంపునకు గురవుతుందని అన్ని ఫొటోల ఆధారాలతో అధికారులకు వినతిపత్రం ఇచ్చిన ఏ ఒక్క అధికారి మా బాధను అర్థం చేసుకోవడం లేదు ఏ అధికారి మా సమస్యను పటించు కొన్నప్పుడు మా బాధను మా ఆవేదనను ఇంకా ఎవరికి చెప్పుకోవాలి.ఇప్పటికైన పోలవరం ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి మా ఎస్ సి కాలని ని సర్వే చేసి మాకు నష్టపరిహారం ఇచ్చి త్వరగా మా గ్రామానికి పునరావాసం కల్పించి మాకు అన్ని సదుపాయాలు కల్పించాలని రేఖపల్లి ఎస్ సి కాలని వాసులు ఓ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

చిరుధాన్యాల విత్తనాలతో గిరి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ రఫీ, సంగప్ప, శ్రీనివాస బాబు

విశాలాంధ్ర-చింతపల్లి: నాణ్యమైన చిరుధా న్యాల విత్తనాలను ఉచితంగా పొంది గిరిజన రైతులు ఆర్థికంగా నిలదొక్కు కోవాలని హైదరాబాదుకు చెందిన డాక్టర్ రఫీ, డాక్టర్ సంగప్ప, డాక్టర్ శ్రీనివాస బాబు లు అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ 2025 భాగంగా భారతీయ చిరుధాన్యాల సంస్థ (ఐ సి ఏ ఆర్- ఐఐఎంఆర్), హైదరాబాద్, మరియు లంబసింగి ట్రైబల్ ఎస్ పి ఓ ఆధ్వర్యంలో లంబసింగి, రాజు పాకలు, చింతపల్లి గ్రామాలలో నాణ్యమైన చిరుధాన్యాల విత్తనాలని గిరిజన రైతులకు మంగళవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 1183 కిలోల విత్తనాలని రైతులకు ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. ఈ విత్తనాలను సకాలంలో విత్తుకోవడం వలన నాణ్యమైన చిరుధాన్యాలు పంట పండి ఆశించిన ధరలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత కాలంలో చిరుధాన్యాలకు మంచి గిరాకీ ఉందన్నారు. పండించిన పంటలను మార్కెటింగ్ చేసేందుకు లంబసింగి ఎస్ పి ఓ, ఐఐఎంఆర్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు రాజేష్, కన్నబాబు, రూతు, రాహుల్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా

పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం

విశాలాంధ్ర-పార్వతీపురం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో జూన్ 5న జిల్లా వ్యాప్తంగా సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టాల ని కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. వనం మనం కార్యక్రమం కింద జూన్ 5న మొక్కలు నాటే కార్యక్రమంపై మంగళ వారం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదు లక్షల మొక్కలు నాటుట లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాలో పచ్చదనం శాతం పెంచడమే లక్ష్యమని చెప్పారు. జిల్లాలో 38 శాతం పచ్చదనం ఉందని, దానిని 50శాతంకు పెంచాలని యోచిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అటవీశాఖ మొక్కలు పంపిణీ చేయాలని, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఉద్యాన శాఖ, అటవీ శాఖ, జలవనరుల శాఖ తదితర శాఖలు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. ఫారం పాండ్స్, ఖాళీగా ఉన్న పాఠశాలల ఆవరణలు, పురపాలక సంఘాల స్థలాలు, జలవనరుల స్థలాలు, పంచాయతీ, అటవీ శాఖ స్థలాల్లో మొక్కలు నాటాలని ఆయన ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం సుధారాణి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు, జిల్లా ఉద్యాన అధికారి బి శ్యామల, అటవీ అధికారులు పాల్గొన్నారు.

ఏడాది లో డెబ్బై శాతం హామీలు అమలుచేశాం

మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర-సాలూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన ఏడాదిలోనే డెబ్బై శాతం హామీలను అమలు చేశామని మంత్రి సంధ్యారాణి అన్నారు.కూటమి పాలనకు ఏడాది అయిన సందర్భంగా మంగళవారం తమ క్యాంప్ కార్యాలయం లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశం లో ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి ఏడాదిలోనే డెబ్బై శాతం హామీలు అమలుచేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ళ పాలనలో ఎనభైఐదు శాతం హామీలకు ఎగనామం పెట్టిందన్నారు.అటువంటి వారు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను వెన్నుపోటు దినం అని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.వెన్నుపోటు, గొడ్డలివేటు కు పేటెంట్ జగన్ రెడ్డిదే అంటూ ఎద్దేవా చేశారు.గత ప్రభుత్వం చేసిన కుంభకోణాలు ఒకొక్కటిగా బయటపడుతున్నాయని వాటినుండి ప్రజల దృష్టి మరల్చడానికే ధర్నాల డ్రామా ఆడుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీ ని అడ్డం పెట్టుకుని లక్షలకోట్లు దోచుకున్న జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి వైకాపా స్థాపించాడన్నారు.శివకుమార్ అనే వ్యక్తి స్థాపించిన వైకాపా ను కబ్జా చేసి శివకుమార్ కు వెన్నుపోటు పొడిచారన్నారు.ఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటినుండి గెంటేసి కుటుంబ వ్యవస్థకే మచ్చ తెచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి కి దక్కుతుందన్నారు.మద్యపాన నిషేధం పై మాట తప్పడమే కాకుండా నాసిరకం మద్యాన్ని అమ్మకం జరిపి పేదల ఆరోగ్యంతో ఆటలాడుకున్నారని దుయ్యబట్టారు.మెగా డీఎస్సీ హామీ పై మాట తప్పి యువకులకు వెన్నుపోటు పొడిచారన్నారు.కూటమి ప్రభుత్వం ఏడాదిలో గిరిజన సంక్షేమానికి 1300 కోట్ల రూపాయలు వెచ్చించిందన్నారు.అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుండే 4000రూ. ఫించన్ గా అందించామన్నారు.దీపం-2 పథకం క్రింద ఏడాదికి మూడు సిలిండర్లు చొప్పున అందిస్తున్నామని ఏడాదిలో కోటి సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేశామన్నారు.2025-26 సంవత్సర బడ్జెట్‌లో బీసీల కోసం 47,456 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు.స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు.కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన రోజును సైకో పాలనకు చరమగీతం పాడిన రోజుగా ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమం లో ఆమె తో పాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి,మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల.పరమేష్,కౌన్సిలర్ హర్షవర్ధన్,సీనియర్ నాయకులు కూనిశెట్టి భీమారావు, కరి బుగత భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ యూత్ వాలంటీర్లకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర -వి.ఆర్.పురం: మండల కేంద్రం రేఖపల్లి ఏ ఎస్ డి ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ట్రైబల్ యూత్ వాలంటీర్ ట్రైనింగ్ ఆన్ ట్రైబల్ యాక్ట్ , ప్రభుత్వ పథకాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ ఎస్ డి ఎస్ ఫౌండర్ %ఊ% డైరెక్టర్ వి.గాంధీబాబు మాట్లాడుతూ ఈ శిక్షణ యొక్క ముఖ్య ఉద్దేశం అనగా వి ఆర్ పురం, చింతూరు మండలంలోని 40 గ్రామాలలోని యూత్ వాలంటీర్ కొత్తగా వచ్చిన వాట్స్ యాప్ ద్వారా స్కీమ్స్ కి ఎలా అప్లయ్ చేసుకోవాలో అవగాహన కలిపించుకుని ప్రతి ఒక్కరు తమ కుటుంబాలు ప్రభుత్వ పథకాలు పొందాలన్నారు ఈ శిక్షణలో ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుండి మెగా (పిఓ) పిఎంయూ ఆన్‌లైన్ లో ఆధార్, ఎన్ఆర్ఈజీఎస్, తల్లికివందనం అన్నదాత సుఖీభవ , పి ఎంకిషాన్ ఎలాపొందాలి అనేవిషయాలపై శిక్షణ ఇవ్వటం జరిగింది. ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుండి వచ్చిన నరేంద్ర (ఏపీఎల్ఓ) సదరం సర్టిఫికెట్, లేట్ బర్త్ సర్టిఫికెట్, మ్యారేజ్ సర్టిఫికెట్ వాటిని ఎలా పొందాలి అనేవిషయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ డి ఎస్ ప్రాజెక్టు మేనేజర్ చల్లారి సాయి చైతన్య మరియు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులకు వయోవృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-వి ఆర్ పురం: వికలాంగులకు వయోవృద్ధులకు రేషన్ సరుకులు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని రాజుపేట కాలనీ గ్రామానికి చెందిన ముంజపు సరస్వతికి బూత్ కన్వీనర్ రేవు సింహాచలం ఆధ్వర్యంలో మంగళవారం రేషన్ సరుకులు సేల్స్‌మెన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేల్స్‌మెన్ జల్లారపు రాంబాబు, సచివాలయ సిబ్బంది పోలీస్ శాఖ స్వాతి, అంగన్వాడి టీచర్ స్వాతి, బి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రాజుపేట కాలనీ సమస్యలు మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లిన టిడిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి ముప్వ

మంత్రి సంధ్యారాణి ఆదేశాలతో ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్ రాజుపేట కాలనీలో పర్యటన





విశాలాంధ్ర-ఎటపాక: ఎటపాక మండలం రాజుపేట కాలనీలో ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను టిడిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి ముప్వ శ్రీనివాస్ ఇటీవల జిల్లా ఇన్ఛార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి , జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా , మంత్రి ఆదేశాలతో చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ , ఆయా శాఖల అధికారులతో కలిసి మంగళవారం రాజుపేట కాలనీలో కాలినడకన తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు ముప్వ శ్రీనివాస్ , రాజుపేట కాలనీలో ముఖ్యంగా ప్రజలు ఎదుర్కొంటున్న తెలంగాణ - ఆంధ్ర సరిహద్దు విద్యుత్ సమస్య , రహదారులు , త్రాగునీటి సమస్యలను పిఓ దృష్టికి తీసుకెళ్లగా ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారి చేశారు. త్వరితగతిన ఆయా సమస్యల పట్ల పరిష్కారం చూపుతామని పిఓ తెలియజేశారు. దాంతో రాజుపేట కాలనీ ప్రజలు , నాయకులు ముప్వ శ్రీనివాస్ ఐటిడిఏ పిఓ అపూర్వ భరత్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ కాక కామేశ్వరి , తహసిల్దార్ కారం సుబ్బారావు , ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎటపాక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ ఎర్రయ్య, ఎలక్ట్రికల్ జేఈ పరశురాం, లైన్ మెన్ శంకర్, మాజీ జెడ్పిటిసి గోడేటి రవికుమార్, పసుపులేటి రాంబాబు, కోడి కాంతారావు, సుకోరాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీపు జాతకు ఘనస్వాగతం

అమరవీరుల విగ్రహాలకు పూలమాలలు

విశాలాంధ్ర-చింతూరు: మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ టీచర్ పోస్టుల మినహాయించాలని షెడ్యూల్ ఏరియాలో 100% ఉద్యోగాలు ఆదివాసీలకే కల్పించాలని మే 31 నుండి జూన్ 4 వరకు సీతంపేట నుండి కేఆర్ పురం వరకు నిర్వహిస్తున్న జీపు జాత మంగళవారం చింతూరు డివిజన్లోని లక్కవరం చేరుకుంది. లక్కవరం గ్రామంలో గిరిజనులు జాతకు ఘన స్వాగతం పలికారు. చింతూరు ప్రధాన కూడలి వద్ద అమరవీరుల సెంటర్లో ఆదివాసి అమరవీరులైన గంటం దొర మల్లు దొర కొమరం భీమ్ అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలో సురేందర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 100% ఉద్యోగ ఉపాధ్యాయ నియామకం చేపట్టాలని ఏజెన్సీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏజెన్సీ పోస్టులు మినహాయించాలని కోరారు. రాష్ట్ర ఏజెన్సీ ప్రాంతంలో మే 31 సీతంపేట ఐటిడిఏ వద్ద ప్రారంభమైన జీపు జాత జూన్ 4న కేఆర్ పురం ఐటిడి వద్ద చేరుకుంటుందని ఈ కార్యక్రమానికి ఆదివాసి ప్రజలు విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు లోత రామారావు, కిలో సురేంద్ర, రాష్ట్ర నాయకులు అశోక్, బొప్పెన కిరణ్, జిల్లా నాయకులు పులి సంతోష్ సిరిమల్లె రెడ్డి, సీసం సురేష్, లక్ష్మణ్, రాజయ్య, కోసం వీరయ్య సత్తిబాబు సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ మనోజ్ ధర్మల్ వీరభద్రం నరకం చిన్నయ్య పాల్గొన్నారు.

గ్రామ సభలు పెట్టి కౌలు రైతులను గుర్తించి భూ యజమానితో సంబంధం లేకుండాకౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



విశాలాంధ్ర-బలిజిపేట: బలిజిపేట మండల తాసిల్దార్ రత్న కుమారి గారికి జూన్ 3 వినతి పత్రం కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి లిరెడ్డి రమణమూర్తిలి మాట్లాడుతూ బలిజిపేట మండలంలో సుమారుగా 2000 మంది కౌలు రైతులు ఉన్నరు, గత సంవత్సరం 1060 మందికి మాత్రమే కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చారు వాస్తవంగా భూ యజమాని సంతకంతో కౌలుకార్డు ఇవ్వాలని గత ప్రభుత్వం మెలికి పెట్టిన తర్వాత చాలామంది భూ యజమానులు అంగీకరించడం లేదు కావున లిగ్రామసభలు పెట్టి సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి కార్డులు ఇవ్వాలని అన్నదాత సుఖీభవ 20000 రూపాయలు పెట్టుబడి సహాయం కౌలు రైతులకు అందించాలని వాస్తవ సాగుదారులు పేరుతోనే ఈ క్రాఫ్ నమోదు చేయాలి భూమి స్వభావంతో సంబంధం లేకుండా వేసిన ప్రతి పంటకు ఈ క్రాఫ్ చేయాలి కౌలు రైతులు సాగుదారులు పంట రుణాలు రీ షెడ్యూల్ చేసి కొత్తగా పంట రుణాలు ఇవ్వాలిలి, కూటమి ప్రభుత్వం 2011 చట్టాన్ని అమలు చేసి కౌలురైతులకు న్యాయం చేస్తామని చెప్పారు ఆ విధంగా న్యాయంచేయాలని ఆయన అన్నారు కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు బద్దాన భానుమూర్తి, ప్రజా సంఘాల నాయకులు యమ్మల మన్మధరావు, లక్ష్మమ్మ, గౌరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ దేవాలయాలవద్ద

బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించిన్ల ఎస్పీ మాధవ్ రెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం మన్యంజిల్లాకేంద్రంలో శ్రీఇప్పల పోలమ్మ, శ్రీఎర్రకంచమ్మలను జిల్లాఎస్పీ మాధవ్ రెడ్డి మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సిరిమానోత్సవముల బందోబస్తు ఏర్పాట్లను,సిరిమాను ఉత్సవ ఏర్పాట్లను, గుడిలోపల, క్యులైన్ల వద్ద, సిరిమానుతిరిగే ప్రదేశాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మరియు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తీసుకోవలసిన చర్యలపై పూర్తిగా వివరించారు . స్థానిక పురపాలక సంఘ కార్యాలయ ఆవరణంలో సిసి కెమరాల పుటేజును పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత సురాణతో కలిసి పరిశీలించారు. భక్తులకు సులభమైన దర్శనం చేసుకునే విధంగా సుమారు 400మంది పోలీసులతో అమ్మవారి పండగకు బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. సిరిమాను/అమ్మవారి ఘటాలు తిరిగే ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించి, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా, ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పండగలో జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ఎటువంటి దొంగతనాలకు ఆస్కారం లేకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ట్రాఫిక్ రద్దీని బట్టి డైవర్షన్ విధానాన్ని పాటించాలన్నారు. సిరిమాను తిరిగే సమయంలో తీసుకోవలసిన చర్యలు,బందోబస్తు ఏర్పాట్లనుగూర్చి వివరించారు. జిల్లా కేంద్రంలో శ్రీఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ అమ్మవార్ల పండగలో ఎటువంటి అల్లర్లు జరగకుండా, పండగను శాంతియుతంగా జరిగేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వాహనదారులకు, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండాహెవీ వెహికల్స్ వాహనదారులుకు/వాహన చోదకులు మంగళవారం సాయంత్రం నుండి పాటించాల్సిన ఆదేశాలు జారీచేసారు.సిరిమాను తిరిగే సమయంలో నాలుగు వైపుల నుండి పార్వతీపురం పట్టణానికి వచ్చే వాహనాలను నిలుపుదల చేసే చర్యలు చేపట్టారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీవెంట పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురాన,పార్వతీపురం పట్టణ సిఐ మురళీధర్, ఎస్బీ సిఐ రంగనాథం, సిసిఎస్ సిఐ అప్పారావు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

18న రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గం నియామకం

విశాలాంధ్ర- పార్వతీపురం: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈనెల 18వ జరుగుతుందని జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. 18 ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని ఆయన చెప్పారు. సమావేశంలో జిల్లాకు సంబంధించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. రెడ్ క్రాస్ జిల్లా బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ సభ్యులను, చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి, ఇతర సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు తప్పనిసరిగా హాజరై విజవంతం చేయాలనికోరారు.

65 ఏళ్ళుదాటిన వారికి, వికలాంగులకు ఇంటి వద్దకే నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలో చౌక ధరల దుకాణాల నుండి నిత్యావసర వస్తువులన65 సంవత్సరాల వయసు దాటిన వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందజేస్తామని తహసిల్దార్ కే ప్రసన్నకుమార్ తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వృద్ధులు, వికలాంగులు రేషన్ దుకాణాల వద్ద క్యూ లైన్లలో వేచిఉండాల్సిన అవసరం లేదన్నారు. రేషన్ డీలర్ స్వయంగా ఇంటి వద్దకు వచ్చి మీకు రావాల్సిన రేషన్ సరుకులను అందజేస్తారని తెలిపారు.మండలంలోని 39 రేషన్ డిపోల ద్వారా నిత్యవసర వస్తువులు సరాపరా ప్రక్రియ విజయవంతంగా జరుగుతుందన్నారు. డీలర్లు కూడా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సేవలందించడంతోపాటు వినియోగదారులు కూడా వస్తువులు తీసుకోవడానికి రేషన్ డిపోలకు వస్తున్నారని తెలిపారు. రెవిన్యూ అధికారులు, రెవిన్యూసిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు.

బాధితులను తక్షణమే ఆదుకోవాలి

విశాలాంధ్ర -పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్ల బురిడీ అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, ఇల్లు కోల్పోయిన వారికి గుర్తించి పక్క ఇల్లు మంజూరు చేయాలని ,అలాగే కనీసం నిలువ నీడ లేకుండా కట్టు బట్టలతో ఉన్న వారిని అధికార యంత్రాంగం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు దాలినాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ నాయ కులతో కలిసి తాళ్ల బురిడీ అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించి, ఘటన జరిగిన కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అర్హత గల పేదలకు పక్కా ఇల్లు మంజూరు చేస్తున్నామని ప్రచారం చేయడం తప్ప ,క్షేత్రస్థాయిలో మాత్రం ఇళ్ల నిర్మాణాలు జరగడంలేదని కేవలం అధికారంలో ఉన్న వారికే ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని ఆరోపించారు. ఇంత పెద్ద స్థాయిలో అగ్నిప్రమాదం జరిగిన రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం, బాధితులకు కనీసము నిత్యవసరాల వస్తువులు సరఫరా చేయకపోవడం విచారకరమని మండిపడ్డారు. అలాగే గ్రామంలో త్రాగునీటి సమస్య ఉందని తక్షణమే అధికారులు దీన్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వయస్సు పైబడిన వారికి ఇంటి వద్దనే రేషన్

ఐటీడీఏ పీవో

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: దివ్యాంగులు, 65 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటి వద్దనే రేషన్ అందించడం జరుగుతుందని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. చౌక ధరల దుకాణాల నుండి రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమంను మండలం నర్సిపురం, బెలగాం చౌక ధరల దుకాణాలలో మంగళవారం తనిఖీ చేశారు. వయసు పైబడిన వృద్ధులు, వికలాంగులు రేషన్ కోసం సమీపంలో గల చౌక ధరల డిపో వద్దకు రానవసరం లేదని, డీలరే నేరుగా ఆ కుటుంబానికి నిత్యవసర సరుకులను అందిస్తాడని అన్నారు.నిత్యావసర సరుకుల నిల్వలు సరిపడా ఉంటాయని, అందవు అనే అనుమానాలు వద్దని ఆయన చెప్పారు. ఇంటి వద్దనే బియ్యం అందించుటకు అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు. చౌక ధరల దుకాణాలకు వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. చౌక ధరల దుకాణాలు ఉదయం 8 గంటలకు విధిగా ప్రారంభం కావాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వము నిర్ణయించిన సమయం ప్రకారం ప్రతి రేషన్ షాపు తెరిచి ఉంచాలని అందుకు సంబంధించి ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.

ఇంటి వద్దకే రేషన్ తొలగించడం సరికాదు

రేషన్ దుకాణాల్లో సరుకులు పంపిణి ప్రజలకు భారం

తీగల బాబురావు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు

విశాలాంధ్ర-అడ్డతీగల : అల్లూరి జిల్లా ఏజెన్సీ పరిధిలో ఉన్న గ్రామాల్లో గత 5 సం"రాలుగా రేషన్ సరుకులు తీసుకోవటంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, సరుకులు నేరుగా వీదులలోకి ఇంటి వద్దకే వచ్చేవని, అలాంటి ఉపయోగకరమైన విధానం తీసివేయటం సరికాదని"ఆదివాసీ సంక్షేమ పరిషత్" (274/16) అల్లూరి జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 5 లేదా 6 కిలోమీటర్లు దూరం నడక మార్గంలో వెళ్లి వరుసలో నిల్చొని తమ పేరు పిలుపు కొరకు ఎదురు చూస్తూ ఎన్నో ఇబ్బందులు పడుతూ తిరుగు ప్రయాణంలో బరువు మోయలేక ఎండకు ఎండుతూ, వానకి తడుస్తూ భారంతో ఇంటికి చేరుకునేవారని, కొన్ని సందర్భాల్లో చీకటి కూడా అయ్యేదని అన్నారు. మళ్ళీ అదే విధానం తీసుకోని రావటం వల్ల ఆర్థిక భారం, శరీరక శ్రమ, సమయ వృధా అవుతున్నాయని, అందువలన రేషన్ దుకాణాల్లో సరుకులు పంపిణీ ప్రజలకు భారమని అన్నారు. ప్రజలకు ఉపయోగం లేని విధానాలతో ఇబ్బంది పెట్టొద్దని, మరల యధావిధిగా ఇంటి ఇంటికి రేషన్ ఇవ్వాలని అన్నారు.

ఘనంగాప్రపంచ క్లబ్‌ఫుట్ దినోత్సవం

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలోని జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రంలో (డిఈఐసి) ప్రపంచ క్లబ్‌ఫుట్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చికిత్సా కేంద్రం వైద్యులు మాట్లాడుతూ క్లబ్‌ఫుట్‌తో బాధపడే వారికి వారి కుటుంబాలకు క్లబ్‌ఫుట్ గురించి అవగాహన కల్పించడానికి, దానిని సరిచేయడానికి అందుబాటులో ఉన్న చికిత్సల గురించి మాట్లాడటానికి ఒక మంచి అవకాశమని తెలిపారు. క్లబ్‌ఫుట్ అనేది పాదానికి పుట్టుకతో వచ్చే ఒక వైకల్యం, ఇది పాదం లోపలికి మరియు పైకి తిరగడానికి దారితీస్తుందని ఈ సమస్యను సరిచేయడానికి చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ముఖ్యంగా పోన్‌సేటి పద్ధతి ద్వారా, ఇది ప్లాస్టర్ కాస్ట్‌లు మరియు తాత్కాలిక బ్రేసింగ్‌లను ఉపయోగిస్తుందని క్లబ్‌ఫుట్‌తో బాధపడే పిల్లలకు, వారి తల్లిదండ్రులకు మద్దతును అందించడానికి, వారిని ప్రోత్సహించడానికి క్లబ్‌ఫుట్‌ను సరిచేయడానికి ఒక చిన్న మార్గం కూడా చేయగలిగితే, అది వారి జీవితాల్లో గొప్ప మార్పు తీసుకురావచ్చునని క్లబ్‌ఫుట్‌తో బాధపడే ప్రతి ఒక్కరూ ఒక సాధారణ మరియు సంతోషకరమైన జీవితం గడపడానికి ఇది అవకాశం కల్పిస్తుందని తెలిపారు. క్లబ్‌ఫుట్ చికిత్స ద్వారా, పిల్లలు సాధారణంగా నడవగలుగుతారని, ఒక సాధారణ జీవితం గడపగలుగుతారని ఈ ప్రపంచ క్లబ్‌ఫుట్ దినోత్సవం, క్లబ్‌ఫుట్‌తో బాధపడే పిల్లలకు మరియు వారి కుటుంబాలకు ఒక అద్భుతమైన అవకాశమని, అందరూ ఈ సమస్య గురించి అవగాహన పెంచుకోవాలని, క్లబ్‌ఫుట్‌తో బాధపడేవారికి సహాయం చేయడానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డా. శేషగిరిరావు, పెడియాట్రిక్ వైద్యులు డా. భరత్ చంద్ర, ఫిజియోథెరపీ వైద్యులు డా. ఎద్దు లక్ష్మీనారాయణ, క్యూర్ ఇండియా కోఆర్డినేటర్ స్వప్న, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కోర్ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు

విశాలాంధ్ర-జికె వీధి : జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం, అరుకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వంపురీరు గంగులయ్య ఆదేశాల మేరకు నియోజవర్గ కోర్ కమిటీ సభ్యులు గొర్లే వీర వెంకట్, మండల అధ్యక్షులు కోయం బాలరాజు ఆధ్వర్యంలో పెదవలస పంచాయతీకి జనసేన పార్టీ కమిటీ సభ్యులుగా, పంచాయతీ అధ్యక్షులుగా వీరోజీ త్రిమూర్తులు, గడుతూరి రమణ బాబు ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా అరుకు పార్లమెంట్ జనసేన పార్టీ జనసేన ఇన్చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య కు, గొర్లే వీర వెంకట్ కు, కొయ్యం బాలరాజు కు, పాంగి కృష్ణారావు కు, వసపరి ప్రసాద్ కు పెదవలస పంచాయతీ జనసేన పార్టీ కమిటీ సభ్యులు విరోజు త్రిమూర్తులు అధ్యక్షులు, గడుతూరి రమణబాబు ఉపాధ్యక్షులు, పార్లమెంటు,నియోజకవర్గం కోర్ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దృష్టిలో పెట్టుకొని పంచాయతీలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

వెన్నుపోటు.....గొడ్డలివేటు పేటెంట్ జగన్ రెడ్డి దే

టీడీపీ ఇన్‌చార్జ్ పడాల భూదేవి

విశాలాంధ్ర-సీతంపేట: వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి,కుంభకోణాల నుంచి ప్రజా దృష్టి మళ్లించడానికే ధర్నాల డ్రామా ఆడుతున్న జగన్ ముఠా,తొలి ఏడాదిలో 10శాతం హామీలను కూడా అమలు చేయని జగన్ ప్రభుత్వం.ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70% హామీలు అమలు చేసిన కూటమి ప్రభుత్వం.ఐదేళ్లల్లో 85శాతం హామీలకు ఎగనామంపెట్టిన జగన్ సర్కార్ సామాజిక వర్గానికి చెందిన జింకా వెంకట నరసయ్య తన బెరైటీస్ మైన్లో జగన్ తాత రాజారెడ్డి కి కొంత భాగస్వామ్యం కల్పిస్తే కృతజ్ఞత లేకుండా మైన్ ఓనర్ ని హత్య చేసి ఆ మైన్ ను రాజారెడ్డి కబ్జా చేశాడు.. బీసీలకు వెన్నుపోటుతోనే జగన్ కుటుంబం బెరైటీస్ గని యాజమాని అయ్యారు, కాంగ్రెస్ ని అడ్డంపెట్టుకొని రూ. లక్షల కోట్లు దోచుకొని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీ పార్టీని స్థాపించాడు, శివకుమార్ స్థాపించిన వైకాపాపార్టీని కబ్జా చేసి ఫాం శివకుమార్ కు వెన్నుపోటు పొడిచాడు, ఎత్తుకొని పెంచిన బాబాయ్ ని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకుల్ని కాపాడుతూ రక్త సంబంధానికి వెన్నుపోటు పొడిచాడు,ఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి, కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచాడు, ఐదేళ్ల పాలనలో 85శాతం హామీలు ఎగనామంపెట్టి ప్రజలకు వెన్నుపోటు పొడిచాడు,మద్యపాన నిషేధంపై మాట తప్పి, మడమతిప్పి విషపూరిత మద్యం పోసి పేదల ఆరోగ్యానికే వెన్నుపోటు పొడిచాడు, మెగా డీఎస్సీ హామీపై మాట తప్పి యువతకు వెన్నుపోటు పొడిచాడు, అన్న క్యాంటీన్లు రద్దు చేసి పేదలను, కార్మికులను వెన్నుపోటు పొడిచాడు,బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించిన్యాయానికి వెన్నుపోటు పొడిచాడు,

కూటమి పాలనలో తొలి ఏడాదిలోనే 70% హామీలు అమలు

మొదటి నెలలోనే రూ.4వేలు పింఛన్ పెంచి అమలు చేశాం. నెలకు రూ.2720 కోట్లు.. ఏడాదిలో రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం,16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి... మొదటి సంతకం మాట నిలబెట్టుకున్నాం.దీపం-అధికారంలోకి రాగానే రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టాం. ఇప్పటికి రూ.1200 కోట్లు ఖర్చుచేసి 20 వేల కి.మీ రోడ్లు బాగుచేశాం. మళ్లీ వర్షాలు వచ్చాయి. దెబ్బతిన్న రోడ్లను బాగుచేస్తాం. ఇది నిరంతరం ప్రక్రియ. గత ప్రభుత్వం లా వదిలెయ్యం.మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే 217 జీవో రద్దు చేశాం. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం కింద రూ.259 కోట్లు ఇప్పటికే అందజేశాం,203 అన్న క్యాంటీన్లు తెరిచాం..21 దేవాలయాల్లో నిత్య అన్నదానం ప్రారంభిస్తున్నాం, చెత్త పన్ను రద్దు చేశాం. గత ప్రభుత్వం పన్ను వేసింది కానీ... 83 లక్షల టన్నుల చెత్త తీయలేదు,ధాన్యం రైతులకు గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1674 కోట్లు విడుదల చేశాం,అధికారంలోకి వచ్చి తొలి ఏడాదిలోనే 70శాతం హామీలు చేసిన ప్రభుత్వం మరోకటి లేదు.. సంక్షేమం-అభివృద్ధి సమపాలనలో చేస్తున్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు గారు.. అసలైన వెన్నుపోటు దారుడు జగన్ రెడ్డి.. వెన్ను పోటు అంటూ ధర్నాలు చేయడం దొంగే దొంగ అన్నట్లుగా ఉంది..జగన్ ముఠా దుష్ప్రచారాలు త్రిప్పికొట్టి అభివృద్ధి-సంక్షేమాన్ని నిలబెట్టుకోవాలి.

మలేరియా నిర్మూలనకు గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు కృషి చేయాలి

పెదవలస వైద్యాధికారిని లు కోమలి, పృధ్విషా

విశాలాంధ్ర-చింతపల్లి/జీకే వీధి: మలేరియా మాసోత్సవాలను గ్రామ గ్రామాన నిర్వహించి మలేరియా నిర్మూలనకు గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు కృషి చేయాలని పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ కోమలి, డాక్టర్ పృధ్వీషాలు అన్నారు. ప్రతి నెల మొదటి మంగళవారం నిర్వహించే ఆశ డే ను పురస్కరించుకొని మంగళవారం వెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఆశా కార్యకర్తలతో నిర్వహించిన ఆశ డే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ప్రతి ఒక్కరూ గ్రామ గ్రామాన దోమల నివారణకు నడుం బిగించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేసిన నాడే మన్య ప్రాంతంలో మలేరియా అంతం అవుతుందని అన్నారు. ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ ద్వారా తీసుకున్న అనేక నిర్ణయాలతో మలేరియా తగ్గు ముఖం పట్టిందని, అక్కడక్కడ ఉన్న మిగిలిన మలేరియా ను కూడా అంతమొందించేందుకు ఆశా కార్యకర్తలు అంతా గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. అనంతరం టీవీ సూపర్వైజర్ అశోక్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకై ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. దగ్గు, జ్వరం తదితర లక్షణాలున్న 100 మందిలో 50 మందికి కళ్లె పరీక్ష, 50 మందికి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించాలన్నారు. కళ్లె పరీక్షలో నెగిటివ్ వచ్చిన వారికి కూడా ఎక్స్ రే పరీక్షలు నిర్వహించాలని, ఈ విషయమై ప్రతి ఒక్క ఆశా కార్యకర్త తమ పరిధిలో ఉన్న గృహాల లోని కుటుంబ సభ్యుల యొక్క వివరాలను రాసుకుని దగ్గు, జ్వరం లక్షణాలున్న ప్రతి ఒక్కరి నుంచి కళ్లే పరీక్షకు శాంపిల్స్ తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు, టీ బీ ఎస్టిఎల్ఎస్ శ్రీనివాసరావు, హెల్త్ విజిటర్ దేవమని, ఎం ఎల్ హెచ్ పి లు సంతోషి, అనీషా జోయ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం లో వైసీపీ శ్రేణులు పాల్గొనాలి : మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బలిజిపేట: ఏడాది అవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని దీనికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్సీపి ఆధ్వర్యంలో ఈనెల 4న వెన్నుపోటు దినం నిర్వహించ నున్నామని దీనికి పార్టీ శ్రేణులు ప్రజలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు బలిజిపేట మండలంలో వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు ప్రజలతో కలిసి వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలతో పాటు గత వైఎస్ఆర్సిపి పథకాలను అమలు చేస్తానని ప్రజలను నమ్మించి గద్దెనెక్కిన తర్వాత మోసం చేశారని దుయ్యబెట్టారు అధికారంలోకి వస్తూనే వాలంటీర్లను తొలగించారని ఇప్పుడు ఎం డి యు ఆపరేటర్లను తొలగించారని నిరుద్యోగ భృతి ఇవ్వలేదని ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్న చంద్రబాబు పాలనకు చరమగీతం పాడేందుకు ఇప్పటికే ప్రజలు సిద్ధమయ్యారన్నారు ఉద్యోగులు ఉపాధ్యాయులకు పిఆర్ లు ఐఆర్లు డిఏలు ఇవ్వలేని ,ఇచ్చిన హామీలు అమలు చేయలేదని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి వెన్నుపోటు పొడిచారన్నారు ఇందుకు నిరసనగా పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 4 న వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం పట్టణంలో నిరసన ర్యాలీ చేపడతామన్నారు అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం ఇస్తా మన్నారు పార్టీ ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రేణులు, అభిమానులు భాధిత వాలంటీర్లు ఆపరేటర్లు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విశాలాంధ్ర- కురుపాం: రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ అదిష్టానం పిలుపు మేరకు జూన్4 న కురుపాం లో నిర్వహించే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో ఐదుమండలాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీపీ శెట్టి పద్మావతి కోరారు. మంగళవారం కురుపాం లో వెన్నుపోటు దినం కు సంబంధించిన పోస్టర్ విడుదల చేసారు. ఈ సందర్భంగా

మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తి చేసుకొని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సందర్భం గా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి , పిలుపు మేరకు, మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి మరియు పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 10గంటలకు కురపాం లో గల పెట్రోల్ బంకు నుండితహశీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని కావున అందరూ తప్పనిసరిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. జడ్పీటీసీ సుజాత ,జడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ నిషార్ ,ఉపసర్పంచి షేక్ ఆదిల్ ,నాయకులు శెట్టి నాగేశ్వరరావు ,శ్రీధర్ పాల్గొన్నారు.

మలేరియా జ్వరాలపై ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలి

పీహెచ్‌సీ వైద్య అధికారి హిమబిందు

విశాలాంధ్ర-సీలేరు: ఆదివాసీలు మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని జీకేవీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే.హిమబిందు అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వ్యాధుల సీజన్ ప్రారంభం కావడం వల్ల గ్రామాల్లో జ్వరాలు, అతిసారా ప్రభలే అవకాశం ఉందన్నారు. జ్వర బాధితులు విధిగా రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. మలేరియా నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నారు. వ్యాధులు సోకిన వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆదివాసులు కాచి వడబోసిన నీళ్లను తాగాలని, నిలువ ఆహారం తినరాదని ఆమె తెలిపారు. గర్భిణీలు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని, ప్రసవానికి 10 రోజుల ముందు ఆసుపత్రిలో చేరాలన్నారు. ఆశా కార్యకర్తలు తమ పరిధిలోనున్న గ్రామాలను సందర్శించి ప్రజల యోగక్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవా లన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలితే వెంటనే ప్రాథమిక చికిత్స అందించి పీహెచ్సీకి సమాచారం ఇవ్వాలన్నారు. ఆశా కార్యకర్తలు విధులు పట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాణి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడి విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర -జి.మాడుగుల: మండలంలోని రైతులు సబ్సిడిపై విత్తనాలు ఎరువులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఎల్.అప్పలరాజు ఏవో పాత్రుడు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం రైతులకు సబ్సిడిపై విత్తనాలు, అలాగే వివిధ ఎరువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ.. గత మే నెలలో విత్తనాలు రైతులకు అందజేసి ఉంటే బావుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని పంచాయతీ సచివాలయాల్లో ఈ విత్తనాలతో పాటు ఎరువులు అందుబాటులో ఉంటుయన్నారు. కావల్సిన రైతులు వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమెలి చిట్టిబాబు, వంతాల క్రిష్ణమూర్తినాయుడు, తల్లె చిట్టిబాబు, కొతారి బొంజుబాబు, కె సింహాచలం, ఎం.రామారావు, జి.అప్పారావు, పి.భీంబాబు, కె.లక్ష్మణ్‌రావు, లకే బాలయ్యదొర, కె.పిన్నయ్య, టి.వెంకటరావు, ఎం.సింహాచలం, ఎస్.కొండల రావు, బి.బాబురావు, పిన్నలుదొర వెంకటమూర్తి, నితిన్‌కుమార్ పాల్గొన్నారు.

మత్స్య దేవత ఎఫ్‌పీవో ద్వారా విత్తనాల అందజేత

విశాలాంధ్ర-జి.మాడుగుల: శ్రీమత్స్యదేవత ఎఫ్‌పీవో ద్వారా రైతులకు చిరుధాన్యాల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఎఫ్‌పీవో సీఈవో ఐసారం హనుమంతరావు తెలిపారు. మంగళవారం పెదలోచలి పంచాయతీ కేంద్రంలో రైతులకు రాగులు, సామలు, జొన్నలు, కొర్రాలు మొదలగు విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయిన మాట్లాడుతూ.. పూరతన పంటలు పండించే లక్ష్యంగా ఇక్కడి రైతులు ప్రతి ఏటా ఉచితంగా అందజేయునట్లుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో డా.రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాడులమ్మ ఉత్సవం

విశాలాంధ్ర-జి.మాడుగుల: స్థానిక సంతబయలలో వెలసిన శ్రీ మత్స్యమాడుగులమ్మ ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మత్స్యరాస మత్స్యరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ స్థలం పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

విశాలాంధ్ర-జి కే వీధి : సంకాడ పంచాయతీ పెద్దజడమూరు గ్రామం వద్ద పెట్రోల్ బంక్ స్థలం, జాతీయ రహదారి రింతాడ జంక్షన్ పనులను పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాలకు సంబంధించిన మ్యూటేషన్ ను రెవిన్యూ అధికారులు వేగవంతంగా చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి తాసిల్దార్ టి రామకృష్ణ, ఆర్ ఐ మహాదేవ్, వీఆర్వోతదితరులు పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పార్వతీపురం: పిఎం సూర్యఘర్ పర్యావరణ హితమైనదని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పర్యావరణ దినోత్సవం, పిఎం సూర్యఘర్, తదితర అంశాలపై మంగళవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామంలో ఎక్కువ యూనిట్లు విద్యుత్ ఖర్చు చేస్తున్న వారికి పిఎం సూర్యఘర్ ఎంతో ప్రయోజనకరమన్నారు. ఇంటి పైకప్పు పైన మాత్రమే కాకుండా ఇంటి ప్రక్కన స్థలం ఉంటే అక్కడ కూడా సౌర విద్యుత్ పలకలు పెట్టవచ్చని ఆయన వివరించారు. పిఎం సూర్యఘర్ కు రుణం అందించడం జరుగుతుందని, మూడు, నాలుగు సంవత్సరాలలో రుణం తీరిపోతుందని, తరువాత సంవత్సరాలు విద్యుత్ ఉచితంగా వినియోగించుకోవచ్చని అన్నారు. పర్యావరణ దినోత్సవం రోజున పెద్ద ఎత్తున పిఎం సూర్యఘర్ యూనిట్లు ప్రారంభించి పర్యావరణ మిత్రులుగా ఉండాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు మొక్కలు నాటడం గూర్చి, గ్రామాల్లో నిత్యవసర సరుకులు పంపిణీ గూర్చి, యోగాంధ్ర కార్యక్రమాలు గూర్చి సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి మరియు పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి, పాలకొండ సబ్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె హేమలత, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం సుధారాణి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు, పార్వతీపురం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఏ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 8న కురుపాంలో సీనియర్ సిటిజన్లతో యోగాంధ్ర

కురుపాంలో ఈనెల 8న సీనియర్ సిటిజన్లతో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు.ఈనెల5న సీతంపేటలో పర్యాటక ప్రాంతాలలో యోగ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యోగాంధ్ర శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని ఆయన అన్నారు. యోగ ప్రతీ ఒక్కరి జీవితంలో భాగస్వామ్యం కావాలని, ప్రతీరోజు సాధన చేయాలన్నారు.

ఆదివాసీ ట్రస్టు కార్యక్రమాలపై విచారణ చేయాలి

ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

విశాలాంధ్ర-చింతపల్లి : అల్లూరి జిల్లా లో ఆదివాసీలను మోసగిస్తున్న ఆదివాసీ ట్రస్టు కార్య క్రమాలపై విచారణ చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు.. అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో ఆదివాసీ ట్రస్టు పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసి ట్రస్ట్ చైర్మన్ కే బీ పడాల్ ఆదివాసులను మోసగించారని, ఈ విషయంలో న్యాయం చేయాలని, సోమవారం చింతపల్లిలో ఏజెన్సీ లో స్పెషల్ డీఎస్సీ సాధన కై జరిగిన జీపు జాత సభలో బాధిత ఆదివాసులు పిర్యాదు చేశారని సురేంద్ర తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ట్రస్టు పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసి ట్రస్ట్ చైర్మన్ కే బి పడాల్ తమను మోసగించినట్లు ఆదివాసులు పిర్యాదు చేశారన్నారు.ట్రస్టు నిబంధనల ప్రకారం ట్రస్టు సేవ కార్య క్రమాలు మాత్రమే చేయాలన్నారు. ఆదివాసీ ట్రస్టు నిబంధనలకు వ్యతిరేకంగా ఆదివాసీ ట్రస్టు కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం జోక్యం చేసుకుని పోలీసులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రస్టు నుండి మోసపోయిన ఆదివాసులకు వారు కట్టిన డబ్బులు ట్రస్టు నుండి తిరిగి ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివాసుల నుండి వసూలు చేసిన డబ్బులతో బిట్ కాయిన్స్ వ్యాపారాలు, ఆన్లైన్ బిజినెస్ చేస్తున్నట్లు ఆదివాసులు పిర్యాదు ఇచ్చారన్నారు. ట్రస్టు ద్వారా ఉచితంగా విద్య, ఉద్యోగం, గ్రామాల అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలు డబ్బులు వసూలు చేసి మోసగించారని ఆదివాసులు పిర్యాదులో బాధితులు పేర్కొన్నారని, దీనిపై ప్రభుత్వం, పోలీసులు జోక్యం చేసుకుని ట్రస్టు నిబంధనలకు వ్యతిరేకంగా పని చేస్తూ ఆదివాసులను మోసగిస్తున్న ఆదివాసీ ట్రస్టు కార్యక్రమాలపై విచారణ చేయాలని, ఆదివాసుల నుండి వసూలు చేసిన కోట్లాది రూపాయలు డబ్బులు తిరిగి ఇప్పించాలని, అదే క్రమంలో ఆదివాసులను మోసగిస్తున్న వారిపై చర్యలు తీసుకొని అమాయక ఆదివాసులకు న్యాయం చేయాలని కిల్లోసురేంద్ర డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఆదివాసి ట్రస్ట్ బాధిత. వైస్ చైర్మన్. కొయ్యం చిన్నబ్బాయి, కార్యదర్శి. వండలం బాలయ్య. చిక్కుడు అశోక్ లతో పాటు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు ధనుర్జయ్, చిరంజీవి , బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



గంజాయి వద్దు... రాజ్మా ముద్దు

రైతులు, యువతకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు.

విశాలాంధ్ర-చింతపల్లి: దుష్ప్రభావాలు కలిగించే గంజాయి సాగు, రవాణా లు వద్దు... ఆరోగ్యాన్ని కలిగించే రాజ్మా, వరి వంటి వ్యవసాయ పంటలే ముద్దు అని బలపం సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు అన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బలపం గ్రామంలో మంగళవారం ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గంజాయి సాగు, అక్రమ రవాణా ల వలన అనేక మంది అమాయక గిరిజనులు జైళ్ల లో మగ్గు తున్నారని, గంజాయి వలన దుష్ప్రభావాలు కలగడమే గాక గిరిజనులు, యువత కేసులలో చిక్కి ఆ కుటుంబాలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. దీనిపై ఆపరేషన్ పరివర్తన ద్వారా రైతులు, యువతకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా జోలికి పోకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు పై ఆసక్తి ఉన్న రైతులకు రాజ్మా చిక్కుళ్ళు, వరి వంటి వ్యవసాయ పంటలను సాగు చేసేందుకు 90 శాతం రాయితీ పై విత్తనాలు అందిస్తామన్నారు. ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం నిమిత్తం ఉపాధి హామీ పథకం ద్వారా గిరి రైతులకు కావలిసిన అవకాడో, సపోటా, లిచి, డ్రాగన్ పండ్లు వంటి మొక్కలను అందించేందుకు గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకుడు ఎం బాబురావు, సచివాలయం సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్... పరేషాన్...

ప్రతిపక్ష పార్టీల పథకాలను నిర్వీర్యం చేసే పన్నాగం.

ఇంటింటికి వచ్చే ఎండియు వాహనాలను తొలగించి, డి ఆర్ డిపోల పేరిట రేషన్ లబ్ధిదారులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం

ఎంపీపీ అనూష దేవి, జడ్పీటిసి బాలయ్య

విశాలాంధ్ర - చింతపల్లి :- రేషన్ లబ్ధిదారులను పరేషాన్ (ఇబ్బంది పెట్టేందుకే) చేసేందుకే కూటమి ప్రభుత్వం ఎండియు వాహనాలను రద్దుచేసి డి ఆర్ డిపోలను ప్రారంభించిందని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు అమలు చేసిన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే పన్నాగంలో భాగంగా గత వైకాపా ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసి ఇంటింటికి రేషన్ అందించే ఎండియు వాహనాలను కూటమి ప్రభుత్వం తొలగించి పాత పద్ధతిలో డిఆర్ డిపో ల ద్వారా నిత్యవసర నరుకులను పారదర్శకంగా పంపిణీ చేస్తామని చెప్పడం రేషన్ లబ్ధిదారులను ఇబ్బంది పెట్టడానికేనన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు ఇంటింటికి నిత్యవసర నరుకులు అందించే ఎండియు వాహనాలను తొలగించి డి ఆర్ డిపోల ద్వారా నిత్యవసర నరుకులు పంపిణీ చేస్తామని రేషన్ లబ్ధిదారులను ఇబ్బంది పెట్టడం బాధాకర మన్నారు. నమ్మి ఓట్లు వేస్తే తమను ఇబ్బంది పెట్టే విధంగా పథకాలను రూప కల్పన చేయడం కూటమి ప్రభుత్వానికి తగునా, అని రేషన్ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారన్నారు. సాఫీగా సాగిపోతున్న రేషన్ నరుకుల పంపిణీ కార్యక్రమాన్ని కేవలం వైకాపా తీసుకువచ్చిన ఎండియు వాహనాలను తొలగించి ఆ ఉద్యోగులను, తద్వారా ప్రజలను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం ఈ విధంగా నియంతృత్వ నిర్ణయాలు తీసుకుంటుందని వారు ఆరోపించారు. జూన్ ఒకటవ తేదీ నుంచి డిఆర్ డిపోల ద్వారా రేషన్ అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ నేటికీ నెట్ సహకరించడం లేదనే నెపంతో రేషన్ లబ్ధిదారులను డిఆర్ డిపోల చుట్టూ తిప్పించుకుంటున్నారని, మారుమూల గిరి గ్రామాలలో సుదూర ప్రాంతాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవలసిన దుస్థితి కలగడంతో ఈ ప్రాంత ప్రజలు ఓటమి ప్రభుత్వం పై అసహనం వ్యక్తం చేస్తున్నారని, కేవలం వైకాపా తెచ్చిన పథకాలను నిర్వీర్యం చేయాలన్న ఏకైక లక్ష్యంతో కూటమి ప్రభుత్వం నమ్మి ఓట్లేసిన ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని వారు విమర్శించారు. ఇప్పటికైనా పునరాలోచన చేసి మన్య ప్రాంతంలో ఎండియు వాహనాల వ్యవస్థను కొనసాగించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ..

రెవెన్యూ అధికారులు రీ సర్వే మర్చిపోయారా?

కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్

విశాలాంధ్ర-పాడేరు: రెవెన్యూ అధికారులు భూములు రీ సర్వే ప్ర క్రియ మర్చిపోతున్నారని, సరిగా చేయకుంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. భూముల సర్వే సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. జూన్ నెలాఖరునాటికి మ్యుటేషన్లు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రీ సర్వే చేయడానికి 13 నోటిఫికేషన్ జారీ చేయకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని తాహాశీల్దారులను హెచ్చరించారు. మంగళవారం క్యాంపు కార్యాలయం నుండి 22 మండలాల రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మ్యుటేషన్ల ప్రక్రియ పక్కాగా చేపట్టాలన్నారు. వ్యవసాయ భూములకు నీటి వినియోగం చేసే చోట నీటి పన్నులను వసూళ్లు చేయాలని ఆదేశించారు. రంపచోడవరం డివిజన్లో మ్యుటేషన్లు, రీ సర్వే ప్రక్రియ సంతృప్తికరంగా జరగడం లేదని వేగం పెంచాలన్నారు. మ్యుటేషన్ల రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించాలన్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమలను సర్వే చేసి రిపోర్టు సమర్పించాలన్నారు. రెవెన్యూ అధికారులు, ఎంపిడి ఓలు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి దురాక్రమణ చేసిన భూములను గుర్తించాలని చెప్పారు. అభ్యంతరకరమైన పోరంబోకు భూములను ఆక్రమిస్తే తొలగించి అభ్యంతరంలేని పోరంబోకు భూములలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. గతంలో జారీ చేసిన ఇళ్ల స్థలాల పట్టాలను పునఃపరిశీలించాలని ఆదేశించారు. ఇళ్ల పట్టాలు ఇచ్చిన వారికి వేరే చోట ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు ఉంటే గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేసి ఇళ్లు లేని పేదలకు కేటాయించాలని స్పష్టం చేసారు.

ఈ సమావేశంలో పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం సబ్

భారతీయ కిసాన్ మోర్చా జిల్లా సదస్సు

విశాలాంధ్ర -కూనవరం: భారతీయ కిసాన్ మోర్చా జిల్లా స్థాయి సదస్సు కూనవరం భాస్కర టాకీస్ లో ఈనెల 8న ఉదయం 11 గంటలకి జరగనుందని రాష్ట్ర కార్యదర్శి నోముల రామారావు జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర స్థాయి నాయకత్వం రానున్నారని పోలవరం నిర్వాసిత రైతులు గిరిజన రైతుల సమస్యలపై చర్చించి పరిష్కారం దిశగా కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు రైతులు నిర్వాసిత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వరి విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-ముంచంగిపుట్టు :అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల పరిధిలో జోలపుట్ పంచాయితీకి చెందిన లబ్బూరు గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి యం. శ్రీనివాస్ బాబుఆధ్వర్యంలో మండల అధ్యక్షురాలు అరిసెల సీతమ్మ చేతుల మీదగా వరి విత్తనాలు పంపిణీ చేసామని ఆయన తెలిపారు ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2025 కి రైతులకు 90% రాయితీ తో వరి విత్తనాల పంపిణీ ప్రారంబించమనారు అలాగే మండలం లో గల ప్రతి పంచాయతీ కేంద్రాలలో పంచాయతీ సర్పంచ్ ఎంపీటీసీలు ద్వారా పంపిణీ కార్యక్రమానికి సిద్ధం చేస్తున్నమన్నారు. పంపిణీ చేయుచున్న వరి రకాలలో యం.టీ.యు 2037 (441 క్వింటాళ్ళు, యం.టీ. యు.1121 (324 క్వింటాళ్ళు), యం . టీ.యు 1318 (102 క్వింటాళ్ళు), యం.టీ యు 1061 (81 క్వింటాళ్ళు) యం.టీ.యు 1064 (150 క్వింటాళ్ళు), యం.టీ.యు 1224 (99 క్వింటాళ్ళు), ఆర్.ఎన్.ఆర్. 15048 (90 క్వింటాళ్ళు), ఎన్.ఎల్.ఆర్.34449 (140 క్వింటాళ్ళు), మొత్తం 1429 క్వింటాళ్ళు అందుబాటులో ఉందనారు ఈ రకాల వరి పంటలకు ఎన్నిరోజులకు పంట చేతికి వస్తుందో వాటి సాగు విధానాం నీటి సామర్థ్యం సాగా విధానంపై రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ వైస్ ఎంపీపీ భాగ్యవతి వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు సర్పంచ్ గంగాధర్ మాజీ మండల టిడిపి అధ్యక్షురాలు సన్యాసమ్మ ఎఫ్.పి.ఓ అధ్యక్షులు దశరథ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది క్రితం ప్రజల్లో ఏర్పడిన నమ్మకమే...మరింత బాధ్యత పెంచింది

164 సీట్ల విజయం - ప్రజలు చెప్పిన మార్పు సంకేతం

వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

విశాలాంధ్ర-కురుపాం: ఏడాది క్రితం జూన్ 4 ప్రజల్లో ఏర్పడిన నమ్మకం ద్వారా పొందిన 164సీట్లు కూటమి ప్రభుత్వానికి మరింత బాధ్యత ను పెంచిందని దానిని నిలబెట్టుకునేందుకు శతశాతం కృషిచేస్తూ పని చేస్తోందని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ అన్నారు.ఎన్డీఏ కూటమి 2024లో సాధించిన 164 అసెంబ్లీ సీట్ల ఘన విజయానికి నేడు (జూన్ 4) సమర్థవంతంగా ఒక సంవత్సరం పూర్తయిందని గత ఏడాది ఇదే రోజు ప్రజలు తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుంది. ఇది కేవలం ఓటు కాదు - ప్రజల కోపం, నమ్మకం, ఆశల ఫలితం. "అహంకార ప్రభుత్వానికి చరమగీతం, అభివృద్ధికి ఆహ్వానం," అని ఆయన అన్నారు.వైఎస్సార్సీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా, పరిపాలనాపరంగా చాలా వెనుకబడ్డదని ఆయన తెలిపారు. "అవినీతి, అరాచకానికి ప్రజలు నో చెప్పారు. చంద్రబాబు గారి నాయకత్వాన్ని మళ్లీ నమ్మారు," అని అన్నారు.ఈ ఏడాది కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు మళ్లీ మొదలయ్యాయని, పెట్టుబడులు వస్తున్నాయని, రైతులకు, విద్యార్థులకు, యువతకు భరోసా కలిగిందని తెలిపారు. "164 సీట్ల విజయాన్ని మేము ఒక్కరోజు జ్ఞాపకంగా కాదు %-% ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే బాధ్యతగా చూస్తాం," అని వీరేష్ చంద్రదేవ్ అన్నారు.

అంతర్ రాష్ట్ర రహదారికి గోతులు పూడుస్తున్న పోలీస్ శాఖకి కృతజ్ఞతలు

విశాలాంధ్ర-జికే వీధి: మండలంలోని ఆర్.వి నగర్ నుండి లంకపాకలు,సప్పర్ల వరకు తీవ్ర గోతులతో అంతర్ రాష్ట్ర రహదారి రోడ్డు అధ్వానంగా వాహనదారులకు తీవ్ర బురదమయంగా గోతులతో ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.ప్రజలు,వాహన చోదకుల ఇబ్బందులను గమనించిన పోలీస్ శాఖ తాత్కాలిక మరమ్మత్తులను చేపట్టింది.ప్రభుత్వ అధికారులు చలించక పోయినా పోలీస్ శాఖ గోతులు పూడుస్తూ వాహనదారుల ఇబ్బందులను గమనించిన పోలీస్ శాఖకి కృతజ్ఞతలని పలువురు మండల నాయకులు తెలిపారు. చింతపల్లి ఏఎస్పి కి,గూడెం కొత్త వీధి సీఐ వరప్రసాద్,ఎస్ఐ అప్పల సూరి వ సిబ్బందికి అభినందనలనీ గూడెం కొత్త వీధి జనసేన మండల ఉపాధ్యక్షులు బత్తుల సిద్దార్థ మార్క్అన్నారు.

దండుసూర లో దాహం కేకలు...

-రక్షిత త్రాగు నీటి పథకానికి సరిపడని నీటి లభ్యత.

-గత్యంతరం లేక పక్క ఊర్ల నుంచి త్రాగు నీరు తెచ్చుకొనే దుస్థితి

విశాలాంధ్ర-కురుపాం: మండలం లోని గుమ్మిడి గూడ పంచాయతీ దండుసూర గిరిజన గ్రామాన్ని దశాబ్దాలుగా ప్రతీఏటా వేసవిలో త్రాగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది. గత్యంతరం లేని గిరిజన మహిళలు కొందరు గెడ్డ చలమ నీరు సేకరిస్తే మరికొందరు ప్రక్క గ్రామాలైన గుమ్మిడి గూడ ,సేకుపాడు గ్రామాల్లో నుంచి ఉదయం ,సాయంత్రం త్రాగు నీరు తెచ్చుకోవడం దిన చర్యగా మారింది. గతంలో సమీపంలో గెడ్డ వద్ద బోర్ తీసి హైపలర్ మోటారు ఏర్పాటు చేసి రక్షిత త్రాగు నీరు పథకానికి ఎక్కించేవారు.మోటారు కు సరిపడే విద్యుత్ సరఫరా లేకపోవడంతో కొన్నాళు కు మొరాయించాయి. తర్వాత మరో బోర్ త్రవ్వి మినీ రక్షిత పథకాన్ని ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రతకు రక్షిత నీటి పథకానికి అవసరమైన నీటి లభ్యత కొత్త బోర్ కు లేకపోవడంతో దండుసూర గ్రామస్తులు సమస్య యథాతథంగా మిగిలి పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో త్రాగు నీటి సమస్య కారణంగా నిత్యం ప్రజలు వివిధ రకాల రోగాలు ,జ్వరాలు బారిన పడే వారని మళ్ళీ అదే పరిస్థితి నెలకొంటుందేమో నని భయపడుతున్నామని తెలిపారు. ఎంపీడీవో చొరవ తీసుకుని వేసవిలో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా కు ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని దండుసూర గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే రక్షిత త్రాగు నీటి పథకానికి సంపూర్ణంగా నీరు అందేలా లోతైన బోర్ త్రవ్వించే ఏర్పాటు ఆర్ డబ్ల్యు ఎస్ అదికారులు చేయాలని కోరారు.